RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 ISSUE: 260 EDITOR: KANCHERLA SANDEEP KUMAR VISAKHAPATNAM 15-4-2026 Pages: 8 Rs 2/-
సంపుటి : 17 సంచిక : 260 ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ విశాఖపట్నం 15-4-2026 పేజీలు : 8 రూ 2/-

## అమెరికాకు 'సిలికాన్ వ్యాలీ'...

# భారతదేశానికి 'అమరావతి క్వాంటం వ్యాలీ'



- అమరావతిలో దేశపు తొలి స్వదేశీ క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణ
- అమెరికా సిలికాన్ వ్యాలీకి దీటుగా అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- టెక్నాలజీ వినియోగదారుల నుంచి ఉత్పత్తిదారుల స్థాయికి భారత్ ఎదుగుతోందన్న చంద్రబాబు
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంలో భాగంగా డీప్ టెక్నాలజీ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గడ్డపై దేశ సాంకేతిక రంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం లిఖితమైంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'అమరావతి 1ూ', 'అమరావతి 1ు' అనే రెండు క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవం, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న రోజున ఈ ఘనత సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, భవిష్యత్ టెక్నాలజీలో భారతదేశాన్ని, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఎలాగో, భారతదేశానికి అమరావతి 'క్వాంటం వ్యాలీ'గా కీర్తి గడిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**దేశానికి అమరావతి క్వాంటం కానుక**

"ఈ రోజు చాలా ప్రత్యేకమైనది. ఒకవైపు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి, మరోవైపు ప్రపంచ క్వాంటం దినోత్సవం. విజ్ఞానం ద్వారా సాధికారత సాధ్యమని అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ, రాజ్యాంగం నుంచి క్వాంటం వరకు భారత్ ప్రగతి సాధిస్తోందనడానికి ఇదే నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. అమరావతి 1ను ఎస్ఆర్ఎం

తరువాయి 2లో..




- ఈ నెల 16న పార్లమెంటులో పునర్విభజన, మహిళ్ రిజర్వేషన్ బిల్లులు
- బిల్లులకు సంబంధించి ఎంపీలకు సమాచారం
- రాష్ట్రాల్లో 815 వరకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు సీట్లు పెరిగే అవకాశం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు

తరువాయి 2లో..

# దివ్యాంగ విద్యార్థుల ఎవరెస్ట్ సాహసయాత్ర...

## జెండా ఊపి ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

- ప్రత్యేక అవసరాలు గల 21 మంది విద్యార్థుల ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్ర ప్రారంభం
- దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమం
- కసి, పట్టుదలే మనల్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని విద్యార్థులకు ఉద్బోధ
- సమాజంలో మార్పు కోసం ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామన్న మంత్రి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

కసి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దేశ చరిత్రలోనే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల 21 మంది

తరువాయి 2లో..

## వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది

మంత్రి పార్థసారథి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

జగన్ ఏం చెబితే అది చేస్తాం.. ఆత్మాహుతి దళంగా పనిచేస్తామంటున్నవారు నాయకులా..? లేక ఉగ్రవాదులా?

తరువాయి 2లో..

# వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా: ప్రధాని మోదీ

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా 'దేవ్‌భూమి'ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని..పుణ్యస్థలాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రతిబింబించేలా కుంభమేళాను

తరువాయి 2లో..






**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రపంచంలో అత్యధిక సరకు రవాణా జల మార్గాల్లోనే జరుగుతుంది. ప్రపంచ వాణిజ్యానికి ఈ మార్గాలు జీవనాడుల్లాంటివి. ఇక్కడ ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా.. ఆర్థిక వ్యవస్థలకు ఉక్కపోత మొదలవుతుంది. తాజాగా ఒక్క హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతకే చమురు రవాణా 20శాతం స్తంభించింది. ఇక ఎల్పీజీ, ఎరువులు, ప్లాస్టిక్, హీలియం, ఇతర పెట్రో ఉత్పత్తులకు కటకట మొదలైంది. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి సముద్ర మార్గాలు మరిన్ని ఉన్నాయి. వీటిల్లో చోటు చేసుకొనే చిన్న అలజడి కూడా స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చగలదు. అవేంటో తెలుసా..!

**పనామా కాల్వ..!**

అట్లాంటిక్-పసిఫిక్ సముద్రాలను కలుపుతూ ఉత్తర-దక్షిణ అమెరికా మధ్య నిర్మించిన కాల్వ ఇది. అమెరికా నుంచి ఆసియా మార్కెట్ల వైపు సరకు రవాణాకు అత్యంత కీలకమైంది. ఏటా 13,000కు పైగా రవాణా నౌకలు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. ముఖ్యంగా అమెరికా, చైనా,జపాన్, చిలీ, దక్షిణ కొరియా తదితర దేశాలకు కీలకమైంది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టాక ఈ కాల్వను స్వాధీనం చేసుకోవడానికి తీవ్రంగా యత్నించారు. కానీ, పనామా ప్రతిఘటనతో ట్రంప్ యత్నాలు ప్రస్తుతానికి నెమ్మదించాయి. మళ్లీ ఎప్పుడైనా ఇవి తెరపైకి రావొచ్చు. ఇక వరదలు, కరవు, పొగమంచు, ధూళిమేఘాలు, నౌకల మరమ్మతుల సౌకర్యాలు లేకపోవడం ఈ మార్గంలో ప్రధాన ఇబ్బందులు.

**సూయజ్ కాల్వ..!**

మధ్యధరా సముద్రం నుంచి ఎర్ర సముద్రాన్ని కలుపుతూ ఈజిప్టు భూభాగంలో మానవ నిర్మిత కాల్వ ఇది. 1869లో అందుబాటులోకి వచ్చింది. దాదాపు 200 మీటర్ల వెడల్పుతో 163 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. దీనిని దాటేందుకు 15 గంటలకు పైగా సమయం పడుతుంది. ప్రపంచ వాణిజ్యంలో 12%, కంటైనర్ ట్రాఫిక్‌లో 30% శాతానికి ఈ మార్గమే దిక్కు. ఏటా 19,000కు పైగా నౌకలు ప్రయాణిస్తాయి. 2021లో ఎవర్ గివెన్ అనే అతి భారీ నౌక ఈ కాల్వలో అడ్డంతిరగడంతో రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనిని సరిచేశాక ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకొన్నాయి.

**మలక్కా జలసంధి..**

భౌగోళికంగా ఇండోనేసియా, మలేసియా, సింగపూర్ మధ్య ఉంది. భారత్‌కు అతి సమీపంలోని కీలక జలమార్గం కూడా ఇదే. పసిఫిక్-హిందూ మహా సముద్రాలను

తరువాయి 2లో..

# విశాఖలో రూ.180 కోట్లతో ఏఆర్‌టీ కేంద్రం



## ఈ నెలాఖరు నుంచి మొదలవనున్న కార్యకలాపాలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

తూర్పు తీరానికి తుపాన్ల బెడద ఎక్కువ. వాటి గమనం ఒక్కోసారి ఒక్కోలా ఉంటుంది. వాతావరణంలో మార్పులు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం, భారీ వర్షాలు, భారీ పిడుగులు, ఇతర విపత్తులు అకస్మాత్తుగా విరుచుకుపడుతున్నాయి. వాతావరణంలో ఏ రకమైన మార్పుల వల్ల తీర ప్రాంతాల్లో ఇవి సంభవిస్తున్నాయో తెలుసుకునేందుకు విశాఖ కేంద్రంగా మరింత విస్తృత పరిశోధనలకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏఆర్‌టీ (అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ టెస్ట్ బెడ్)ను భూ విజ్ఞాన మంత్రిత్వశాఖకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (పుణె) ఏర్పాటు చేసింది. ఈ నెలాఖరు నుంచే పరిశోధనలు ఆరంభించనుంది. భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ 'మిషన్ మౌసమ్'లో భాగంగా రూ.180 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడుతోంది. ఏఆర్‌టీ సెంటర్ ద్వారా వాతావరణంలో రసాయనాల ప్రభావం, అవి ప్రజల ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని నిశితంగా

తరువాయి 2లో..

# ఎడిటోరియల్

## ఏపీ కేబినెట్ ఛేంజ్

**లోకేష్ మార్క్.. పవన్ ప్లాన్.. బాబు స్ట్రాటజీ..!**

ఏపీ కేబినెట్‌లో త్వరలో జరగబోయే మార్పులు కేవలం మంత్రుల మార్పిడి మాత్రమే కాదు.. 2029 ఎన్నికల కోసం చంద్రబాబు వేస్తున్న బలమైన పునాదిగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈసారి ప్రక్షాళనలో సరికొత్త సమీకరణాలు తెరపైకి రానున్నాయి. ఈ సారి మార్పుల్లో నారా లోకేష్ మార్క్ స్పష్టంగా కనిపించనుంది. సీనియర్లను పార్టీ బాధ్యతలకు పరిమితం చేసి, యువ రక్తాన్ని మంత్రివర్గంలోకి తీసుకోవాలని బాబు యోచిస్తున్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జనసేన నేతలకు కూడా ప్రాధాన్యత పెంచే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ఉన్న రాజకీయ అసమతుల్యతను సరిదిద్దడానికి, సామాజిక సమీకరణాల్లో ప్రాధాన్యత దక్కని వర్గాలకు ఈ ప్రక్షాళనలో పెద్దపీట వేయనున్నారు. ప్రభుత్వానికి ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తోన్న, అధికారులపై పట్టు సాధించలేని కొందరు మంత్రులకు ఈ సారి నిర్మొహమాటంగా చెక్ పెట్టాలని బాబు డిసైడ్ అయ్యారు. మొత్తానికి చంద్రబాబు తన మార్క్ అడ్మినిస్ట్రేషన్‌తో ప్రభుత్వంలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని చూస్తున్నారు. మంత్రుల పనితీరుపై చంద్రబాబు వద్ద ఇప్పటికే 1, 2, 3 రేటింగ్స్ ఉన్నట్లు సమాచారం. శాఖలపై పట్టు లేనివారు, వివాదాల్లో ఉన్నవారికి ఈసారి ఉద్వాసన తప్పేలా లేదు. రాబోయే మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా, పార్టీని క్షేత్రస్థాయిలో ఉరకలెత్తించే చురుకైన నేతలకు కేబినెట్‌లో చోటు కల్పించడమే బాబు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ సారి మార్పుల్లో జనసేన పార్టీ వరకు పవన్ కూడా పార్టీకి ప్లస్ అయ్యేలా తన పార్టీ మంత్రుల కూర్పును సెట్ చేయనున్నారు. ఈ సారి జనసేనకు మరో కేబినెట్ బెర్త్ అదనంగా దక్కనుంది. అలాగే టీడీపీ వైపు నుంచి నారా లోకేష్ మార్క్ స్పష్టంగా కనిపించనుంది. యువతకు ప్రాధాన్యత పెంచే క్రమంలో కొందరు సీనియర్లను పక్కన పెట్టనున్నారు. వీరికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తారు. పైగా నియోజకవర్గాలు భారీగా పెరగనున్న నేపథ్యంలోనూ కొందరిని పక్కన పెట్టేయనున్నారు. ఏదేమైనా ఈ కేబినెట్ ప్రక్షాళన తర్వాత కూటమి ప్రభుత్వం మరింత దూకుడుగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

## నాగర్ కర్నూల్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణలి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 14**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ విశ్వకర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దిలీప్ విశ్వకర్మ మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. రాజ్యాంగ రూపకల్పన ద్వారా దేశంలోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంతో ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితమంతా అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితమైందని, సమాజంలో ఉన్న అన్యాయాలను తొలగించేందుకు ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు ప్రమోద్, రాష్ట్ర నాయకుడు సుధాకర్ రెడ్డి, తెలకపల్లి మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, తాడూరు మండల అధ్యక్షుడు చిల సుదర్శన్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ధన్నోజు నరేష్ చారి, టౌన్ మాజీ అధ్యక్షుడు ఏలిమే రాము, ఆఫీస్ సెక్రటరీ చందు, అలాగే వివిధ మండలాల జనరల్ సెక్రటరీలు రాజు, లక్ష్మణ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు బాబు, యాదగిరి, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడేమైనా జరిగితే..

# ప్రపంచానికి ఉక్కపోతే..!

కలుపుతుంది. దీనిలో అతి ఇరుకైన మార్గం 1.5 నాటికల్ మైళ్లు ఉంది. 30%శాతం ప్రపంచ వాణిజ్యం ఈ మార్గంలోనే జరుగుతుంది. ఇక ప్రపంచ ఫ్యాక్టరీ చైనాకు చేరే ఇంధనానికి ఈ మార్గమే దిక్కు. ఇక 40% కంటైనర్లు ఈ జలాల్లోనే ప్రయాణిస్తాయి.

**హార్మూజ్ జలసంధి..**

ఇరాన్-ఒమన్-యూఏఈలో ఈ జలసంధి తీరాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే 20శాతం ఎల్ఎన్‌జీ, రోజుకు 2 కోట్ల బ్యారెళ్ల చమురు ఈ మార్గం నుంచి వెళుతుంది. గల్ఫ్ దేశాల ఎగుమతులు, దిగుమతులకు ఈ మార్గమే జీవనాడి. ఇరాన్-ఇరాక్ మధ్య, ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతల సమయంలో ఈ జలసంధి దాదాపు మూతపడింది. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ రెండూ దీనిలో రవాణాను అడ్డుకొంటున్నాయి.

**బాబ్ ఎల్ మండెప్ జలసంధి..**

ఇది యెమన్-జిబూటీ, ఎరిత్రియా తీరాలను పంచుకొంటోంది. ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌తో కలుపుతుంది. ప్రపంచ వాణిజ్యంలో 12%, కంటైనర్ ట్రాఫిక్‌లో 30% ఈ మార్గం నుంచే వెళుతుంది. కానీ, ఈ ప్రదేశంలో ఇరాన్ మద్దతుదార్లైన హూతీల దాడులు నౌకాయానాన్ని కఠినంగా మార్చేశాయి. 2023లో 26,000 నౌకలు ప్రయాణించగా.. 2025 నాటికి వాటి సంఖ్య 12,700కు పడిపోయింది. చాలా నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గాన్ని ఎంచుకొంటున్నాయి.

**తుర్కియే జలసంధులు..**

నల్లసముద్రం-మధ్యధరా సముద్రాన్ని కలుపుతూ తుర్కియేలో బాస్ఫరస్,డర్డనెల్స్ జల సంధులు ఉన్నాయి. నల్ల సముద్రం నుంచి అంతర్జాతీయ సముద్ర జలాల్లోకి నౌకలు చేరాలంటే ఈ మార్గాల్లో ప్రయాణించాల్సిందే. ఆసియా-ఐరోపాను అనుసంధానించే కీలక మార్గాల్లో ఇది కూడా ఒకటి. ప్రపంచ చమురులో 3%, గోధుమల రవాణా 25% ఈ మార్గం నుంచే జరుగుతుంది. తుపానులు, పొగమంచు, యుద్ధాలు ఈ మార్గంలోని ప్రధాన సమస్యలు.

## అమెరికాకు 'సిలికాన్ వ్యాలీ'...

# భారతదేశానికి 'అమరావతి క్వాంటం వ్యాలీ'

యూనివర్సిటీలో, అమరావతి 1ఌ ను మేధా టవర్స్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవి కేవలం కంప్యూటర్లు కావని, క్వాంటం హార్డ్‌వేర్‌ను వాస్తవ పరిస్థితుల్లో పరీక్షించడానికి, ధ్రువీకరించడానికి వీలు కల్పించే పూర్తిస్థాయి టెస్ట్‌బెడ్‌లు అని వివరించారు. ఇప్పటివరకు పరిమితంగా ఉన్న క్వాంటం హార్డ్‌వేర్ యాక్సెస్, ఈ సౌకర్యాలతో పరిశోధకులు, స్టార్టప్‌లకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. "పార్లమెంటు అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించి మాపై నమ్మకం ఉంచింది. ఈ రోజు, ఈ రాజధాని నుంచే దేశానికి ఈ క్వాంటం సౌకర్యాలను కానుకగా అందిస్తున్నందుకు గర్వంగా ఉంది," అని చంద్రబాబు పేర్కొన్నారు.

**సిలికాన్ వ్యాలీ నుంచి క్వాంటం వ్యాలీకి**

భవిష్యత్తు క్వాంటం కంప్యూటింగ్‌దేనని నొక్కిచెప్పిన చంద్రబాబు, ఈ సాంకేతికతను అభివృద్ధి చేసే దేశాలే ప్రపంచాన్ని శాసిస్తాయని అన్నారు. "నిన్నటి వరకు టెక్నాలజీ ఆవిష్కరణల కోసం అందరూ సిలికాన్ వ్యాలీ వైపు చూసేవారు. కానీ నేటి నుంచి, ఎవరైనా తమ ఆవిష్కరణలను ప్రారంభించాలన్నా, పరీక్షించాలన్నా అమరావతిలోని క్వాంటం వ్యాలీకి రావాలి. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంటే, భారతదేశానికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఉంటుంది" అని ఆయన ఉద్ఘాటించారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, ఇంద్రుడి నివాసమైన అమరావతి పేరుతో అత్యుత్తమ భవిష్యత్ నగరంగా దీనిని నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. కాలుష్యరహిత, హరిత ఇంధన ఆధారిత, అత్యుత్తమ జీవన ప్రమాణాలున్న నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

**'ఆత్మనిర్భర్' భారత్ దిశగా కీలక ముందడుగు**

ఈ క్వాంటం వ్యవస్థల రూపకల్పన పూర్తిగా దేశీయ సరఫరా గొలుసుతో జరగడం ఒక చారిత్రక మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఇది కేవలం శాస్త్రీయ విజయం మాత్రమే కాదని, జాతీయ సామర్థ్యానికి ప్రతీక అని అన్నారు. "మనం ఆధారపడటం నుంచి ఆత్మనిర్భర సామర్థ్యం వైపు, భాగస్వామ్యం నుంచి నాయకత్వం వైపు పయనిస్తున్నాం," అని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో టీఐఎఫ్ఆర్ ముంబై, ఐఐఎస్సీ బెంగళూరు, డీఆర్‌డీఓ, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, క్యూబిట్ ఫోర్స్ వంటి అనేక జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఢిల్లీ నుంచి ముంబై, బెంగళూరు నుంచి అమరావతి వరకు వివిధ సంస్థలు ఒకే లక్ష్యంతో పనిచేసి దీనిని సాకారం చేశాయని కొనియాడారు.

**ప్రధాని మోదీ దార్శనికత.. టెలికం స్ఫూర్తి**

టెక్నాలజీని అర్థం చేసుకుని, ప్రోత్సహించే నాయకుడు సరైన సమయంలో ఉండటం దేశ అదృష్టమని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ కోవకు చెందిన వారని చంద్రబాబు ప్రశంసించారు. "నా రాజకీయ జీవితంలో టెక్నాలజీని ఇంతలా అర్థం చేసుకున్న నాయకుడిని చూడలేదు. క్వాంటం మిషన్, సెమీకండక్టర్ మిషన్ వంటివి ఆయన దార్శనికత వల్లే సాధ్యమయ్యాయి" అని అన్నారు. గతంలో వాజ్‌పేయి హయాంలో టెలికం రంగంలో తీసుకువచ్చిన సంస్కరణల వల్ల దేశంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, అదే స్ఫూర్తితో నేడు మోదీ నాయకత్వంలో బీఎస్ఎన్ఎల్, టాటా, తేజస్, ఐఐటీ మద్రాస్ కలిసి స్వదేశీ 4జీ టెక్నాలజీని అభివృద్ధి చేశాయని గుర్తుచేశారు.

**ఏపీలో డీప్ టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థ**

క్వాంటం వ్యాలీతో పాటు రాష్ట్రంలో విస్తృతమైన డీప్ టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. "వికసిత్ భారత్ 2047కు ప్రధాని పిలుపునిస్తే, మేము 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. అందులో డీప్ టెక్నాలజీ కీలకమైన అంశం" అని అన్నారు. తిరుపతిలో స్పేస్ సిటీ, విశాఖపట్నంలో మెడ్‌టెక్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ, రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు, కోపర్తి, అనంతపురంలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో త్వరలో ప్రారంభం కానున్న గూగుల్ ఏఐ, క్లౌడ్ క్యాంపస్ రాష్ట్ర డిజిటల్ ఆశయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.

**యువత, పరిశోధకులకు ముఖ్యమంత్రి పిలుపు**

ఈ సాంకేతిక విప్లవంలో యువత కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు క్వాంటం కోర్సులపై ఆసక్తి చూపడం శుభపరిణామమని అన్నారు. "ఐబీఎం, వైజర్, ఐఐటీ చెన్నై సహకారంతో రాష్ట్రంలోని 4.5 లక్షల మంది యువతకు క్వాంటం, ఏఐ, డీప్ టెక్నాలజీస్‌లో నైపుణ్య శిక్షణ ఇవ్వడమే మా లక్ష్యం" అని ప్రకటించారు. కేవలం 6 నెలల్లోనే శాస్త్రవేత్తలు ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌ను సిద్ధం చేశారని అభినందించారు. "ఇది ఆరంభం మాత్రమే. దీనిని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలి. వేగవంతం చేయాలి. త్వరలో రాష్ట్రానికి రానున్న ఐబీఎం క్వాంటం కంప్యూటర్ కంటే ముందే, అమరావతిలో తయారైన కంప్యూటర్‌ను సిద్ధం చేయాలి" అని శాస్త్రవేత్తలకు ఆయన సవాలు విసిరారు.

**విజ్ఞానం నుంచి క్వాంటం వరకు.. చారిత్రక రోజు**

క్వాంటం టెక్నాలజీ ఔషధాల ఆవిష్కరణ, వాతావరణ అంచనాలు, సురక్షితమైన కమ్యూనికేషన్లు, ఆర్థిక భద్రత, రక్షణ రంగం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని చంద్రబాబు వివరించారు. దీనివల్ల శాస్త్రవేత్తలకే కాకుండా హార్డ్‌వేర్ ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, సాంకేతిక నిపుణులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా హార్డ్‌వేర్, ఉత్పత్తుల రంగంలో భారత్ వెనుకబడిందని, కానీ ఐటీ రంగంలో మన సత్తా చాటామని గుర్తుచేశారు. ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ మనకు మరో సువర్ణావకాశాన్ని ఇచ్చిందని, దీనిని అందిపుచ్చుకుని టెక్నాలజీ వినియోగదారుల నుంచి ఉత్పత్తిదారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ మహా యజ్ఞానికి సహకరించిన ప్రతి శాస్త్రవేత్తకు, సంస్థకు, స్టార్టప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్యాంగ విద్యార్థుల ఎవరెస్ట్ సాహసయాత్ర...

దివ్యాంగ విద్యార్థుల బృందం చేపట్టనున్న నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను మంత్రి లోకేశ్ మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులతో ఇలాంటి సాహసయాత్ర నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నెల ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర కొనసాగనుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 21 మంది విద్యార్థులు (8 మంది బాలికలతో సహా) ఈ బృందంలో ఉన్నారు. వీరంతా సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించనున్నారు. ఏప్రిల్ 15న మధ్యాహ్నం ఈ బృందం నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకొని, అక్కడి నుంచి తమ యాత్రను ప్రారంభిస్తుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి నిర్వహించారు. వారిలో స్ఫూర్తి నింపుతూ, "ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులుగా మీరు ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు వెళ్లడం చాలా ఆసక్తిగా, గర్వంగా ఉంది. సాధారణ వ్యక్తులలో లేని కృషి, పట్టుదల మీలో ఉన్నాయి. జీవితంలో మీరు ఎన్నో అవమానాలు, మాటలు ఎదుర్కొని ఉంటారు. వాటన్నింటినీ అధిగమించి ఈ స్థాయికి రావడం అభినందనీయం. మనలో ఉన్న కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి" అని అన్నారు. "మీలాంటి వారిని ప్రోత్సహిస్తే సమాజంలో కూడా గొప్ప మార్పు వస్తుంది. ఈ కార్యక్రమాన్ని నేను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తాను. మా కుటుంబంలో కూడా ఒకరు మాట తడబాటుతో ఇబ్బంది పడ్డారు. ఎంతోమంది ఎగతాళి చేశారు. దేవుడు ప్రతి కుటుంబానికి ఒక పరీక్ష పెడతాడు, దానిని జయించే శక్తిని కూడా ఇస్తాడు. ఆ శక్తి మీ అందరిలో ఉంది. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించండి. సమాజం మిమ్మల్ని గౌరవించేలా, సొంత పిల్లల్లా చూసుకునేలా మీరు ఎదగాలి" అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. "ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు చెప్పినట్టు 'అమ్మకు చెప్పలేని పని చేయవద్దు' అనే మాటను జీవితాంతం గుర్తుంచుకోండి. నా జీవితంలో కూడా ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు ఎంతో సాయం చేశారు. అదేవిధంగా మీరు కూడా సమాజానికి తిరిగి సేవ చేయాలి. కనీసం 10 మందికి సాయపడాలి. మిమ్మల్ని చిన్నచూపు చూడాలంటే భయపడేలా మీ కృషితో, పట్టుదలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని మంత్రి ఉద్బోధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్య, దివ్యాంగుల ప్రోత్సాహం, అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులను అభినందించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

## మొదటి పేజీ తరువాయి

### ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?

లోక్‌సభ స్థానాలు పెంచనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం.

**సమావేశం కానున్న ఇండియా కూటమి..:** నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై బుధవారం ఇండియా కూటమి నేతలు భేటీకానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై సమాచారం అందిన నేపథ్యంలో.. వాటిపై చర్చించనున్నారు.

### వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా: ప్రధాని మోదీ

పరిశుభ్రంగా, వైభవంగా జరుపుకొందామన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఆసక్తిగా ఎదురు చూసే మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరికొన్ని నెలల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో భక్తుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. దిల్లీ-డెహ్రాదూన్ ఎకనమిక్ కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన 213 కిలోమీటర్ల హై-స్పీడ్, యాక్సెస్-కంట్రోల్డ్ హైవే దిల్లీ- డెహ్రాదూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గిస్తుందన్నారు. కొత్త ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ఆర్థిక స్వరూపం పూర్తిగా మారిపోతుందని.. రోడ్లు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమాన, జలమార్గాలు కలిసి దేశ భవిష్యత్ మార్గాన్ని నిర్దేశిస్తాయన్నారు.

### వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది

అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర వినాశనం కోరుకుంటున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. "అగ్రనాయకత్వం ఆలోచనలో తప్పు ఉంటే చర్చించాల్సింది పోయి.. గుడ్డిగా అనుసరిస్తారా? అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే వైకాపా పనిగా పెట్టుకుంది. రాష్ట్రంలో వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది. వైకాపా హయాంలో అరాచక పాలన సాగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. అభివృద్ధి కంటే.. విధ్వంసానికి ప్రాధాన్యత ఇచ్చింది" అని మండిపడ్డారు.

### విశాఖలో రూ.180 కోట్లతో ఏఆర్‌టీ కేంద్రం

పరిశోధిస్తారు. రుతుపవనాల గమనం, మేఘాలు ఏర్పడే ప్రక్రియ, భూమి వేడెక్కడాన్ని అధ్యయనం చేస్తారు. పరిశోధనలు చేసేందుకు 38 రకాల పరికరాలు ఏయూకి చేరుకున్నాయి.

**వ్యూహాత్మక ప్రదేశం కావడంతో..**

తీర ప్రాంతాల్లో వాతావరణ స్థితిగతులను అధ్యయనం చేసేందుకు భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ విశాఖను వ్యూహాత్మక కేంద్రంగా ఎంపిక చేసింది. దేశంలో ఏయూ వాతావరణ శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ప్రయోగశాల ఏర్పాటు చేశారు. దీనికి కొంత పరిశోధన సహకారం ఏయూ అందిస్తుంది. కొందరు శాస్త్రవేత్తలు ఇక్కడికి వచ్చి పనిచేస్తారు. ఏయూకి, భూవిజ్ఞాన మంత్రిత్వశాఖకు మధ్య ఈ నెలాఖరున అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి. సముద్ర తీరాల్లో కాలుష్య, వాతావరణ పరిశోధనలకు ఈ ప్రయోగశాల కీలకంగా మారనుంది.

### రాజ్యాంగ శిల్పి అంబేద్కర్ జయంతి సందర్భంగా పోలీసుల నివాళులు

**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:14**

శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డి. గోవిందరావు, ఆర్ఐలు కె. నర్సింగరావు, శంకర్ ప్రసాద్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 14**

అనకాపల్లి జిల్లాలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. నాతవరం మండలంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ పర్యటనలో భాగంగా నాతవరం, గొలుగొండ, కేడీ పేట ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను స్పీకర్, హోం మంత్రి ప్రారంభించారు. అలాగే పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన సోలరైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రిగా అనిత తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అసెంబ్లీలో ఆమె ప్రసంగాలు స్పష్టంగా ఉండి అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఉంటాయని తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన రాజకీయ గురువని, ఆయన ప్రోత్సాహంతోనే తాను ఎదిగానని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో రాజధాని అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ సబ్ ప్లాన్



నిధులు దుర్వినియోగం అయ్యాయని విమర్శించిన అనిత, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఆ నిధులను దళితవాడల అభివృద్ధికి వినియోగిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అమాయక గిరిజనులు గంజాయి వ్యవహారాల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించిన



ఆమె, నేరగాళ్లు మరియు రౌడీ మూకలపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు. అలాగే ఎన్డీపీఎస్ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. రాబోయే ఆరు నెలల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో గంజాయి రవాణా, రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

## సమసమాజ స్థాపనకు అంబేద్కర్ కృషి అపారము

### సీపీ శంఖబ్రత భాగ్చి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 14**

ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, భారత రాజ్యాంగ శిల్పి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని కృషి చేసిన సమసమాజ స్థాపకుడు భారతరత్న డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ అని నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత భాగ్చి పేర్కొన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని నగర పోలీసు కమిషనరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని మౌ గ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ బాల్యంలో అనేక వివక్షలను ఎదుర్కొంటూ ఉన్నత విద్యను అభ్యసించిన మహనీయుడని పేర్కొన్నారు. సమానత్వం, మానవ హక్కులు, విద్యా స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన కృషి అపారమని, వ్యక్తిలో ప్రతిభ ఉంటే ప్రపంచం గుర్తింపు ఇస్తుందనే దానికి అంబేద్కర్ జీవితం నిదర్శనమని అన్నారు. అనేక విద్యా రంగాలలో ప్రావీణ్యం సాధించి గొప్ప పండితుడిగా నిలిచారని పేర్కొన్నారు. "బహుజన హితాయ్, బహుజన సుఖాయ్" అనే సిద్ధాంతంతో ఆయన అనేక సంస్కరణలను అమలు చేసినట్లు తెలిపారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయ నాయకుడిగా, రాజ్యాంగ నిర్మాతగా, ముఖ్యంగా సామాజిక సంస్కర్తగా అంబేద్కర్ పేరు చిరస్మరణీయమని చెప్పారు. అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది రాజ్యాంగ స్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా ప్రారంభం

### - పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి





**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ : 14**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించబడుతున్నాయి. ఈ వారోత్సవాల ప్రారంభదినం సందర్భంగా సూర్యబాగ్ అగ్నిమాపక కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హాజరయ్యారు. అలాగే రీజనల్ ఫైర్ ఆఫీసర్ (జోన్-1) డి. నిరంజన్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి కె. సత్యనారాయణ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి ఎం. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి అమరులైన అగ్నిమాపక సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ పుష్పమాలలు అర్పించారు. అనంతరం ఉపన్యాసంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై సివిల్ డిఫెన్స్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మరియు ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సేవలో విశేష కృషి చేసిన రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి. నిరంజన్ రెడ్డి మరియు ఫైర్‌మాన్ ఎం. రామ్ కుమార్‌లకు ముఖ్య అతిథి చేతుల మీదుగా మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమం చివరిలో అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్ని భద్రత పరికరాల ప్రదర్శనను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు.వ అనంతరం అవగాహన ర్యాలీకి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో భాగంగా సిబ్బంది నగరంలోని ప్రధాన వీధుల్లో కరపత్రాలు పంచుతూ ప్రజలకు అగ్ని భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంతో మొదటి రోజు వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ సేవలు ఆదర్శం : ముగడ రాజారావు






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :14**

విశాఖ తూర్పు నియోజకవర్గం 11వ వార్డు, అంబేద్కర్ జంక్షన్ వద్ద డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు, వార్డు ఇంచార్జ్ రాగతి అచ్యుత్ రావు, కాకి గంగరాజు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసి, దేశ అభివృద్ధికి పునాది వేసిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన సేవలు, ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదుపాడ సన్యాసిరావు, జనసేన వార్డు అధ్యక్షులు సారిపల్లి రాము, రామడుగు విక్రమ్ బాబు, వార్డు నాయకులు ముదుండి కృష్ణంరాజు, పేపర్ నాయుడు, ఎస్.కె. కలేశా, బర్రి సూర్యనారాయణ, సి.హెచ్. ఆదినారాయణ రాజు, బోయి శ్రీను, పచ్చిపాల శ్రీను, ప్రేమ్ కుమార్, కడుపుట్ల చిన్నారావు, కిషోర్, కొల్లి ఎర్రాజీ రావు, బోదా లక్ష్మణరావు, పిట్టా అప్పారావు, పల్లా నాని, బోయ శంకర్, రామడుగు శ్యాం, మూది నాగరాజు, లింగబోతు అప్పారావు, బాబా, ఫిరోజ్, లోడగల రమణ, గౌర్నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళల తరఫున మజ్జి లక్ష్మి, రాజేశ్వరి, చందక లలిత, కోడూరి జ్యోతిర్మయి, సీత, ఎస్.కె. బేగం, బోద రాజేశ్వరి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలలో స్థానికులతో కలసి పాల్గొన్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ

**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :14**

దక్షిణ నియోజకవర్గంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతంపేట కార్యాలయం, ఎల్ఐసి బిల్డింగ్ పరిధి, భీమ్ నగర్, 30, 29, 36 వార్డుల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. సమాన సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గం ఆదర్శమని పేర్కొన్నారు. 30వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వికలాంగులకు వీల్ చైర్లు అందజేశారు. 29వ వార్డులో రెండు లక్షల రూపాయలతో నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. స్థానిక ప్రజల అభివృద్ధికి మరిన్ని పనులు చేపడతామని హామీ ఇచ్చారు.



వేడుకల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 23





భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 దేశంలోని ప్రతి పౌరుని గౌరవాన్ని కాపాడే కీలకమైన ప్రాథమిక హక్కుగా నిలుస్తోంది. ఈ ఆర్టికల్ ద్వారా మానవ అక్రమ రవాణా, బలవంతపు శ్రమ, బానిసత్వం వంటి అన్ని రకాల దోపిడీ చర్యలను పూర్తిగా నిషేధించారు. ఈ నిబంధన ప్రకారం, ఎవరికైనా వారి ఇష్టానికి వ్యతిరేకంగా పని చేయమని బలవంతం చేయడం చట్టవిరుద్ధం. భిక్షాటన, నిర్బంధ శ్రమ వంటి దోపిడీ పద్ధతులు కూడా పూర్తిగా నిషేధించబడ్డాయి. వ్యక్తుల నిస్సహాయ పరిస్థితులను ఉపయోగించుకుని వారిని శ్రమలోకి నెట్టడం రాజ్యాంగానికి విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు 1982లో ఇచ్చిన ప్రముఖ తీర్పులో బలవంతపు శ్రమ అనే పదానికి విస్తృత అర్థం ఉందని పేర్కొంది. కేవలం శారీరక బలవంతం మాత్రమే కాకుండా, పేదరికం, ఆకలి, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒక వ్యక్తి కనీస వేతనం కంటే తక్కువకు పని చేయాల్సి వస్తే, అది కూడా బలవంతపు శ్రమగానే పరిగణించబడుతుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు 1982లో ఇచ్చిన ప్రముఖ తీర్పులో బలవంతపు శ్రమ అనే పదానికి విస్తృత అర్థం ఉందని పేర్కొంది. కేవలం శారీరక బలవంతం మాత్రమే కాకుండా, పేదరికం, ఆకలి, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒక వ్యక్తి కనీస వేతనం కంటే తక్కువకు పని చేయాల్సి వస్తే, అది కూడా బలవంతపు శ్రమగానే పరిగణించబడుతుందని కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా, ఒక ఉద్యోగికి కనీస వేతనం చెల్లించడం అతని ప్రాథమిక హక్కు అని పేర్కొంది. కనీస వేతనం కంటే తక్కువ చెల్లించడం లేదా అన్యాయ పరిస్థితుల్లో పని చేయించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తేల్చి చెప్పింది. ప్రస్తుతం దేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణలో ఆర్టికల్ 23 కీలక పాత్ర పోషిస్తోంది. ప్రజల బలహీనతలను ఆసరాగా తీసుకుని దోపిడీకి పాల్పడే యజమానులపై ఈ నిబంధన ఒక బలమైన ఆయుధంగా నిలుస్తోంది. సంక్షిప్తంగా, ఆర్టికల్ 23 ప్రజల గౌరవాన్ని కాపాడటంతో పాటు, సమాజంలో దోపిడీని అరికట్టేందుకు రూపొందించబడిన శక్తివంతమైన రాజ్యాంగ హక్కు.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జ్.**

## రోడ్డు పనుల్లో బాంబు పేలుడు...

### ఇళ్లపై రాళ్ల వర్షం - తృటిలో తప్పిన ప్రాణాపాయం

### కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి అని గిరిజనులు డిమాండ్





**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :14**

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ పరిధిలోని కోరాబాయాలు గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా ప్రమాదకర ఘటన చోటుచేసుకుంది. జలకలగడ్డ గ్రామానికి రహదారి నిర్మాణ పనులు చేపట్టిన ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు కాంట్రాక్టర్ ద్వారా పనులు నిర్వహిస్తున్న సమయంలో ఈ అపశృతి జరిగింది. మంగళవారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న పెద్ద బండరాయిని తొలగించేందుకు కాంట్రాక్టర్ పేలుడు పదార్థం ఉపయోగించి బాంబు పేల్చాడు. ఈ పేలుడు తీవ్రతతో రాళ్లు సుమారు 100 అడుగుల ఎత్తుకు ఎగిసి, దాదాపు 200 మీటర్ల దూరంలో ఉన్న కోరాబాయాలు గ్రామంలోని ఇళ్లపై వర్షంలా కురిశాయి. ఈ ఘటనలో ఇళ్ల పైకప్పుల రేకులు, పెంకులు దెబ్బతిన్నాయి. గ్రామస్తులు అరడుగు దూరంలో ప్రాణాలతో బయటపడ్డామని, దేవుడి దయ వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. రాళ్లు వ్యక్తులపై పడినట్లయితే ప్రాణనష్టం తప్పదని వారు భయాందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, పేలుడు నిర్వహించే ముందు కాంట్రాక్టర్ ఎటువంటి ముందస్తు హెచ్చరిక ఇవ్వకపోగా, చింతపల్లి పోలీస్ స్టేషన్ నుండి అనుమతి కూడా తీసుకోలేదు. సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు విమర్శిస్తున్నారు. ఘటన అనంతరం కాంట్రాక్టర్ పరారయ్యాడని సమాచారం. మరోవైపు, జిల్లా అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్ లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే నష్టపోయిన ఇళ్లను మరమ్మతు చేసి బాధితులను ఆదుకోవాలని కోరాబాయాలు గ్రామస్తులు మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

## మండల ప్రజా పరిషత్ లో అంబేద్కర్ 135 వ జయంతి...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 14:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డా.బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఎంపిపి వీరా మల్లికార్జున రావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమము నందు ఎంపిడిఓ పి ఆర్ సి రాజ్ కుమార్ కార్యాలయ సిబ్బంది , ఎం జీన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బంది, ఎంపీటీసీ లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ జయంతి రోజునే అవమానం

## - వినతి పత్రం విసిరివేతపై ఎమ్మెల్యే వంశీకృష్ణ పై ప్రజలు ఆగ్రహం





**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :14**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా నైట్ ఫుడ్ కోర్ట్ పునఃప్రారంభం చేయాలని డిమాండ్ చేస్తూ నైట్ ఫుడ్ కోర్ట్ ఆధారిత కుటుంబాలు ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టాయి. ప్లకార్డులతో తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 7 నెలల క్రితం నైట్ ఫుడ్ కోర్ట్ మూసివేయడంతో దానిపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 120 కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇంటి అద్దెలు చెల్లించలేక, పిల్లల చదువు నిలిచిపోగా, వైద్య సేవలు కూడా పొందలేని పరిస్థితి నెలకొందని వారు వాపోయారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. సుబ్బారావు మాట్లాడుతూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రతి ఒక్కరికి జీవించే హక్కు కల్పించినప్పటికీ, ఆ హక్కు అమలులో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి. వెంకట్రావు మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఉన్నప్పటికీ, నైట్ ఫుడ్ కోర్ట్ మూసివేతతో వందల కుటుంబాలు ఆ హక్కును కోల్పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారికి వినతి పత్రం అందజేయడానికి ప్రయత్నించగా, దాన్ని స్వీకరించకుండా విసిరివేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి తన అధికారాన్ని అడ్డు పెట్టుకొని ప్రజల పట్ల జులం చూపించడం ఎంతవరకు సమంజసం అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.ఇప్పటికే దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వ్యవహారశైలిపై పలు విమర్శలు వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై స్పందన లోపించడం, బాధితులను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలు అసంతృప్తికి కారణమవుతున్నాయని పేర్కొంటున్నారు. తాజా ఘటనతో ఈ విమర్శలు మరింత బలపడినట్లు తెలుస్తోంది. వినతి పత్రం విసిరివేసిన ఘటనను తీవ్రంగా పరిగణించిన బాధితులు, ఈ విషయాన్ని కూటమి ఉన్నత నాయకుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.స్మార్ట్ ఫుడ్ కోర్ట్ సిద్ధం అయ్యే వరకు పాత స్థలంలోనే తాత్కాలికంగా నైట్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన 97 మంది, అర్హత కలిగిన మరో 31 మందితో కూడిన పూర్తి జాబితాను ప్రకటించాలని జివిఎంసీ అధికారులను కోరారు. నైట్ ఫుడ్ కోర్ట్ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని, ఇప్పటికే రిలే నిరాహార దీక్షలు 21వ రోజుకు చేరుకున్నాయని తెలిపారు. అంబేద్కర్ జయంతి రోజునే జీవన హక్కు కోసం ప్రజలు రోడ్డెక్కాల్సి రావడం పాలన వైఫల్యానికి నిదర్శనమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నైట్ ఫుడ్ కోర్ట్ పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా డా బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 14:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండల గ్రామాలలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బి. ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సువర్ణపేట పెదకొడప ప్రాంతాలలో ఏర్పాటు చేసిన డాబిఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఘనంగా ఆవిష్కరించారు. అంబేద్కర్ ఆశయాలు, సమానత్వం సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటు, మూడుతూములు ప్రాంతంలో వేసవి కాలంలో లో-వోల్టేజ్ సమస్యకు ఏర్పాటు చేసిన 100 కెవి ట్రాన్స్ఫార్మర్‌ను కూడా ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. మండలంలోని పలు ప్రాంతాలలో ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిస్తూ , జయంతి వేదికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్తానిక నాయకులు, గ్రామస్తులు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొనారు.

## విద్యార్థిని పరామర్శించిన కొప్పుల నాగ మానస

**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

అమలాపురం నియోజకవర్గం,ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన నాగులపల్లి వీర్రాజు కుమారుడు, పదవ తరగతి విద్యార్థి నాగులపల్లి మణికంఠ థైరాయిడ్ సమస్యతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు స్పందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు కొప్పుల నాగమనస పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.అమలాపురం నియోజక వర్గం పెద్దలు లింగోలు పండు,గ్రామ పెద్దలు దంగేటి బాబులు, పోలిశెట్టి ఉమగారు, నిమ్మకాయల రాజేష్ , మురమళ్ళ వీర వెంకటస్వామి కలిసి మణికంఠ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుంకర చిన్నబ్బాయి,ఏఎంసీ వైస్ చైర్మన్ పరమట చిట్టిబాబు,ఏరుబండి బుజ్జి, పోలిశెట్టి సురేష్,బోగిశెట్టి సుధీర్ కుమార్, సాక బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో ఉత్సాహం

## విశాఖ పోలీస్ విభాగంలో స్పోర్ట్స్ మీట్ సందడి

### పాల్గొన్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కమిషనర్ శంఖబ్రత బాగ్చి





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :14**

విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన నగర పోలీసు విభాగం వార్షిక క్రీడా పోటీల ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఎం. అభిషిక్త్ కిషోర్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నగర ఆర్మ్డ్ రిజర్వ్ మైదానంలో జరిగిన ఈ క్రీడా పోటీలలో వెస్ట్, సౌత్, నార్త్, హార్బర్, ఈస్ట్, ద్వారకా సబ్‌డివిజన్లు, ట్రాఫిక్ డివిజన్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్, టాస్క్ ఫోర్స్, కంట్రోల్ రూమ్, ఉమెన్ పోలీస్ స్టేషన్, సీసీఆర్‌బీ వంటి విభాగాలతో కూడిన మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథి మార్చ్‌పాస్ట్ గౌరవ వందనం స్వీకరించి, 100 మీటర్ల పరుగు, అధికారుల రేసులు, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడలను ప్రారంభించి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసులు విధుల్లో ఎంత కట్టుదిట్టంగా ఉంటారో, ఫిట్‌నెస్‌పైనా అంతే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్నీ పెంచి, ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. గెలుపోటముల కంటే జట్టు భావన, భాగస్వామ్యం ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు అధికారుల మధ్య అనుబంధాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రెవెన్యూ విభాగంలో కూడా ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించాలనే సంకల్పం వ్యక్తం చేశారు. అనంతరం విజేతలకు పతకాలు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా సమితిని అధికారికంగా ముగిస్తున్నట్లు ప్రకటించి, స్పోర్ట్స్ జెండాను దించి కార్యక్రమాన్ని ముగించారు. మొత్తం 20 ఈవెంట్లలో నిర్వహించిన 140కి పైగా పోటీలలో సుమారు 250 మంది విజేతలు, రన్నర్స్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఆర్‌ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జయహో అంబేద్కర్ నినాదాలతో మారుమోగిన పార్వతీపురం : పాల్గొన్న పలు నాయకులు

**మన్యం జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :14**

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి జంక్షన్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వంగల దాలినాయుడు, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా కిరణ్ కుమార్, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, కురుపాం నియోజకవర్గ సీనియర్ నాయకుడు పత్తిక లక్ష్మయ్య, ఏవో గంటా మోహన్ రావు, పట్టణ కమిటీ నాయకులు బంకురు సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో హరిజనులు, గిరిజనులు మరియు బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి దిశగా నడుస్తున్నాయంటే అది డాక్టర్ అంబేద్కర్ కృషి ఫలితమేనన్నారు. అంబేద్కర్ ఒక వర్గానికి మాత్రమే పరిమితమైన వ్యక్తి కాదని, సమాజంలోని ప్రతి వర్గానికి చెందిన నాయకుడని పేర్కొన్నారు.భారత రాజ్యాంగం ద్వారా సామాజిక, ఆర్థిక సమానత్వానికి పునాది వేసిన అంబేద్కర్ ఎన్నో అవమానాలు, ఆటుపోట్లను ఎదుర్కొని ఈ మహత్తర సేవ చేశారని కొనియాడారు. దేశంలో ఎవరికి ఒకలా, ఎవరికి మరొకలా చట్టం అమలు కాకుండా, రాజ్యాంగం సమానంగా అమలు కావాలని కోరారు. రాజ్యాంగ ఫలాలు ప్రతి సామాన్యుడికి అందాలని, బడుగు బలహీన వర్గాల జీవన ప్రమాణాలు



మెరుగుపడాలని అన్నారు. సమాజంలో ఇంకా ఉన్న కుల, మత, ఆర్థిక అసమానతలు పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమ పాలన కొనసాగించేలా పాలకులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమం చివర్లో "జయహో అంబేద్కర్" అంటూ నినాదాలు చేశారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి శాంతికల్యాణం...







**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 14**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు మంగళవారం బహుళ ద్వాదశి సందర్భంగా స్వామి వారి శాంతి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించడమైనది. విష్వక్సేన పూజ, పుణ్యహావచనం, పాణిగ్రహణం , మాంగళ్య ధారణ, వైభవంగా భక్తుల గోవింద నామాలు మద్య కళ్యాణం జరిగినది. ప్రధాన అర్చకులు పి శ్రీనివాసకిరణ్ ఆద్వర్యాంలో పి శ్రీనివాసు, మాధవచార్యులు, రవి లు శాంతి కల్యాణం నిర్వహించారు. కల్యాణం లో పాల్గొన్న భక్తులకు వేదాశిర్వాదం, శేష వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య, అర్చక సిబ్బంది, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## భట్నవిల్లిలో ఘనంగా అభివృద్ధి పనులు

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు





**అమలాపురం రూరల్ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

మండలం భట్నవిల్లి గ్రామంలో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా భట్నవిల్లి సొసైటీ ఆఫీస్ లో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలలో పాల్గొని నివాళులర్పించడంతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సొసైటీ ఛాంబర్ రూమ్ ని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం అప్పుల పాలు చేసిన ఆంధ్రప్రదేశ్‌ను నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి నెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పేదలకు పెన్షన్లు అందజేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, త్వరలోనే ఇంటింటికీ మంచినీరు మరియు మహిళలకు ప్రతి నెలా 1500 రూపాయల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. భట్నవిల్లి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గారు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. భట్నవిల్లి గ్రామ టీడీపీ కమిటీ కార్యదర్శి నామాడి తారక్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. తన తరపున మరియు గ్రామ ప్రజల తరపున తారక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 3 మండలాల వి.ఓ.ఏలు 147 మందికి సెల్ ఫోన్ పంపిణీ




**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముమ్మిడివరం మండల పార్టీ అధ్యక్షులు అర్ధాన్ని శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ముమ్మిడివరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, మరో ముఖ్య అతిథి అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, డి ఆర్ డి ఎ పిడి డి.రాంబాబు పాల్గొని మూడు మండలాల పిఎంఏజేఏవై లబ్ధిదారుల 35 మందికి 42 లక్షల రూపాయలు చెక్ ఇవ్వడం జరిగింది, మూడు మండలాల ఏూా లు 147 మందికి సెల్ ఫోన్ పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, ఓగూరి భాగ్యలక్ష్మి, తాడి నరసింహారావు గొల్ల కోటి దొరబాబు కట్ట సత్తిబాబు గుద్దటి జమ్మి, కాకర్ల పూడి రాజేష్ సాగిరాజు సూరిబాబు రాజు, సబ్బతి పరమేశ్వరరావు ,ములపర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి ,యళ్ల ఉదయ్, గోదాసి పుండ్రిష్,నడింపల్లి శ్రీనివాసరాజు, రెడ్డి సుబ్బారావు, రెడ్డి శ్రీను, కాశి లాజర్, నీతి పూడి వంశీ, కాకి మాణిక్యం మెండి కమల, బొక్క రుక్మిణి, వసంశెట్టి అమ్మాజీ, కుడిపూడి మల్లేశ్వరి, ప్రసన్న, శ్రీను, కుంచె శ్రీను, మిమ్మితి చిరంజీవి రేఖాడి రాంబాబు, చప్పిడి వరప్రసాద్, కుంచనపల్లి వెంకన్న బాబు, బద్రి రమ, చింతలపూడి కొండబాబు, గుద్దటి విజయ్,గుత్తుల మల్లికార్జునరావు, నడిమింటి సూర్య ప్రభాకర్ రావు, డ్వాక్రా ఏపిఎం రమణ,డ్వాక్రా స్టాప్ పాల్గొన్నారు.

## ఆలయ పునః నిర్మాణ పనులు పరిశీలించిన శాసన సభ్యులు





**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

మురమళ్ల: నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణ పనులను మంగళవారం ముమ్మిడివరం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పరిశీలించారు. చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ, అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ, దేవాదాయశాఖ డీఈ ఉదయ్ కుమార్, ఏఈ సూర్య ఫణీంద్ర కుమార్ లు ప్రస్తుతం జరుగుతున్న పనులు, జరగవలసిన పనులు వివరించారు. ఆలయ ఆవరణ చుట్టూ మార్కింగ్ చేశారు. తదుపరి పనుల్లో రఫ్ట్ పనులకు పలు సూచనలు చేశారు. ఈనెల 12 న శిలా స్థాపన జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్వామి వారి పీఠం చుట్టూ బేస్మెంట్ స్థాయిలో ప్రదేశానికి భద్రత కల్పిస్తూ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈసందర్భంగా శాసన సభ్యులు అధికారులకు పలు సూచనలు చేశారు.

## అమలాపురం జనసేన పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

భారత రాజ్యాంగ నిర్మాత, సమానత్వం--సామాజిక న్యాయాల కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, ఏడిద శ్రీను, హ్యాండీక్రాఫ్ట్ డైరెక్టర్ ఆర్డిఎస్ ప్రసాద్,ఏఎంసీ వైస్ చైర్మన్ పరమట చిట్టిబాబు, అల్లవరం డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ బండారు వెంకనబాబు, అల్లవరం సొసైటీ చైర్మన్ కంకిపాటి గోపి, పోలిశెట్టి బాబులు,ఆకుల సూర్యనారాయణ మూర్తి, డీఎస్ఎన్ కుమార్,ఆత్మా డైరెక్టర్ చేట్ల మంగతాయారు, ముత్యాల మణెమ్మ ,నల్లా చిన్ని, చికేలే చిట్టిబాబు, నల్లా చైతన్య, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాలని, సమానత్వం--సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన బాటలో నడవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.




# నాగర్ కర్నూల్ జిల్లాలో బెల్టు షాపులకు అక్రమంగా మద్యం సరఫరా

### నాగర్ కర్నూల్ జిల్లాలో బెల్టు షాపులకు మద్యం సరఫరా -వైన్స్ నుంచి నేరుగా బెల్టు షాపులకు సరఫరా







**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 14**

నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండల పరిసర ప్రాంతాల్లోని గోవిందాయపల్లి గ్రామంలో అక్రమంగా బెల్టు షాపులకు వైన్స్ షాపుల నుంచి అనుమతి లేని వాహనాల్లో అక్రమంగా మద్యం సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో బెల్టు షాపుల వ్యాపారూలు స్వయంగా మద్యం కొనుగోలు చేసి, మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా బెల్టు షాపులు నిర్వహించే వారు తమ అవసరాలకు అనుగుణంగా సమీపంలోని అనుమతి పొందిన మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం మద్యం వ్యాపారి వాహనాల్లో బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ, ప్రతి బాటిల్‌పై రూ.10 నుంచి రూ.15 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూల్ డ్రింక్స్ అమ్మినట్టు మద్యం అమ్మకాలు డోర్ డెలివరీ చేస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు పెరుగుతున్నాయని, యువతపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఎక్సైజ్ శాఖ సీఐ దృష్టికి తీసుకెళ్లగా, తమకు ఇలాంటి సమాచారం అందలేదని తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి, నిజానిజాలు నిర్ధారించిన అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. స్థానికంగా అక్రమ మద్యం విక్రయాలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పరిసర ప్రాంతాల్లోని గోవిందాయపల్లి గ్రామంలో అక్రమంగా బెల్టు షాపులకు మద్యం సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో ఒక మద్యం వ్యాపారి స్వయంగా మద్యం కొనుగోలు చేసి, బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా బెల్టు షాపులు నిర్వహించే వారు తమ అవసరాలకు అనుగుణంగా సమీపంలోని అనుమతి పొందిన మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం మద్యం వ్యాపారి స్వయంగా బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ, ప్రతి బాటిల్‌పై రూ.10 నుంచి రూ.15 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు పెరుగుతున్నాయని, యువతపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను సంప్రదించగా, తమకు ఇలాంటి సమాచారం అందలేదని తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి, నిజానిజాలు నిర్ధారించిన అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. స్థానికంగా అక్రమ మద్యం విక్రయాలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో టిడిపి పనిచేస్తుంది

## అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముమ్మిడివరం ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి గోపి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముమ్మిడివరం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, మరియొక అతిథి అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.తదుపరి కేక్ కట్ చేసి ఆయన పుట్టినరోజు వేడుకలు నాయకులు కార్యకర్తలు మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హరీష్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత మహా మేధావి ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని గొప్ప ప్రజాస్వామ్యాన్ని అందించిన జాతిరత్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుడని అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తి ఆశయాలు బాటలో తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందన్నారు తెలుగుదేశం పార్టీ నిర్మాణంలోని అంబేద్కర్ ఆశయాల సాధన ఉంది, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తనకు ఆదర్శం అని చాటి చెప్పారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే ఎన్టీఆర్ ప్రభోదం అంబేద్కర్ స్ఫూర్తి నుండి వచ్చిందే నేషనల్ ఫ్రంట్ చైర్మన్గా ఎన్టీఆర్ ఉన్నప్పుడే అంబేద్కర్ కు భారతరత్న అవార్డు ప్రకటించారు పార్లమెంట్ హాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించారు, కె.ఆర్ నారాయణ ను రాష్ట్రపతిగా జిఎంసి బాలయోగిని లోక్సభ స్పీకర్గా నియమించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. మరో ముఖ్య అతిథి ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీలకు



రాజ్యాధికారం కోసం అంకితభావంతో కృషి చేస్తుందని, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎస్సీ ఎస్టీ కమిషన్ ఏర్పాటు దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు సక్రమముగా సబ్ ప్లాన్ నిధులు వినియోగం దళిత కాలనీలో మౌలిక సౌకర్యాల కల్పన సంక్షేమ హాస్టల్ల ఏర్పాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లాంటి అనేక చర్యల ను తెలుగుదేశం పార్టీ చేపట్టిందని అన్నారు తెలుగుదేశం పార్టీ అంబేద్కర్ ఆశయాలతో ముందుకు వెళుతుందని, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారు అంబేద్కర్ ఆశయ సాధన మన లక్ష్యం కావాలి ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ బాధ్యత కలిగిన పౌరుడిగా ఉండటమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళులని బుచ్చిబాబు అన్నారు . అలాగే ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టున ఉన్న అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణ కుమార్,అర్ధాన్ని శ్రీనివాసరావు, కట్టా సత్తిబాబు,, సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్ల రాజేష్, సబ్బతి పనేశ్వర్ రావ్, ఓగూరి భాగ్యశ్రీ, ములపర్తి బాలకృష్ణ, పిల్లి నాగరాజు,యాళ్ల ఉదయ్,మెండి కమల, బొక్క రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

మండలం లోని ముక్తేశ్వరం సెంటర్ లో డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన పి.గన్నవరం నియోజకవర్గ కో. ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు...

### అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి...




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అంబేద్కర్ ఉత్సవాలలో పాల్గొన్నారు. తొలుత అమలాపురం లోని ఎంపీ నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం అమలాపురం పట్టణం నల్లవంతెన సమీపంలోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమలాపురం రూరల్ భట్నవిల్లి గ్రామంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తదుపరి ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అయినవిల్లి మండలం చినతనలంక గ్రామంలో జరిగిన అంబేద్కర్ ఉత్సవాలలో ఎంపీ హరీష్ పాల్గొన్నారు. కొత్తపేట రెడ్డప్పవారిపేటలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# అగ్నిమాపక సేవా దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళి - వారోత్సవాలకు శ్రీకారం




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్, ఏప్రిల్ 14**

అగ్నిమాపక సేవా దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అగ్నిమాపక సిబ్బందికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక సేవా వారోత్సవాలను ఎమ్మెల్యే కె. రాజేష్ రెడ్డి పోస్టర్లను విడుదల చేసి ప్రారంభించారు. ఈ వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముఖ్య కార్యక్రమాలు ఇలా ఉన్నాయి**

**అగ్నిమాపక పరికరాల వినియోగం:** అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగంపై ప్రజలకు ప్రత్యక్ష శిక్షణ ఇవ్వనున్నారు.

**వంటగది భద్రత:** ఎల్పీజీ గ్యాస్ లీకేజీలను గుర్తించడం, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించనున్నారు.

**బహుళ అంతస్థుల భవనాలు:** హైరైజ్ భవనాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత మార్గాలపై మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. విద్యార్థులకు అవగాహన పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక బోధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మాపక అధికారి పి. గిరిధర్ రెడ్డి నేతృత్వంలో హాస్పిటల్స్, థియేటర్లు, పరిశ్రమలలో తనిఖీలు నిర్వహిస్తూ, భద్రతా ప్రమాణాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ప్రమాద సమయాలలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంతో కీలకం..

-అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి..

-జెండా ఊపి జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హారేంధిర ప్రసాద్..

-ఏప్రిల్ 14 నుంచి 20 వరకు జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలు..





**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

అగ్ని ప్రమాదాలు, వరదలు ఇతర విపత్తుల సందర్భాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా విశేష సేవలు అందిస్తున్న అగ్నిమాపక సిబ్బంది సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హారేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామరావుపేట జీఆర్టి హోటల్ కు ఎదురుగా ఉన్న జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హారేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది గౌరవ వందనాన్ని జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అనంతరం అగ్నిమాపక సేవా దినోత్సవం (అమరవీరుల దినోత్సవం) సందర్భంగా గత సంవత్సర కాలంలో దేశ వ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో అమరులైన కేరళ ఫైర్, రెస్క్యూ సర్వీసెస్ కు సంబంధించిన ఫైర్, రెస్క్యూ ఆఫీసర్ సోనీ ఎస్.కుమార్, ఉత్తరప్రదేశ్ ఫైర్, ఎమర్జెన్సీ సర్వీసెస్ కు సంబంధించి డంగర్ సింగ్ త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారికి జిల్లా కలెక్టర్ అంజలి ఘటించారు. అనంతరం ఏప్రిల్ 14 నుంచి 20వరకు జరగనున్న అగ్నిమాపక వారసు వాళ్లకు సంబంధించిన ప్రచార కరపత్రాలు, గోడపత్రికలను జిల్లా కలెక్టర్.. అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారి కార్యాలయంలో ప్రదర్శించిన రెస్క్యూ ఎక్యుప్మెంట్ ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హారేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. 1944 ముంబై డాక్ యార్డ్ పేలుడులో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించడం, అగ్ని ప్రమాదాలు నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు.అగ్ని ప్రమాదాలు, వరదలు అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది విశేషమైన సేవలు అందిస్తున్నారని జిల్లా కలెక్టర్ కొనియాడారు. ప్రమాదకర సమయాల్లో ప్రజల ప్రాణాలను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది చురుకైన పాత్రను పోషిస్తున్నారని ఆయన తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన తెలిపారు. ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజలను అగ్ని ప్రమాదాల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో “సురక్షిత పాఠశాల, సురక్షిత ఆసుపత్రి, అగ్ని భద్రతపై అవగాహన ఉన్న సమాజం” అనే నినాదంతో 2026- జాతీయ అగ్నిమాపక దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ప్రమాద సమయాలలో ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. కాకినాడ జిల్లాలో ఏడు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయని వీటి ద్వారా జిల్లాలో ఎక్కడ ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే తమ సహాయక చర్యలు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన పెంపొందించుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాముఖ్యంగా ఎక్కువమంది ప్రజలు సంచరించే షాపింగ్ మాల్స్, ఇతర పరిశ్రమలలో అగ్ని ప్రమాద భద్రతా చర్యలు మరింత పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రూ.22 లక్షల విలువైన పర్సనల్ ఎక్విప్మెంట్ ఇతర సామాగ్రిని జిల్లా అధికార యంత్రం సహకారంతో సమకూర్చడం జరిగిందన్నారు. భవిష్యత్తులోను సీఎస్ఆర్ నిధులతో ఇతర అవసరమైన మరిన్ని యంత్ర పరికరాలు సమకూర్చేందుకు తన వంతు బాధ్యతగా కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హారేంధిర ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారులు వి.సుబ్బారావు, అదనపు అగ్నిమాపక అధికారి బి.ఏసుబాబు, సూపరింటెండెంట్ జీఎస్ఏ.వినాయక్, డీ. వీరబాబు, జీఆర్ఎస్కే. రెడ్డి, పి. సముద్ర రాజు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా నుంచి బెంగుళూరుకు గంజాయి తరలింపు

- విజయనగరంలో నలుగురు అరెస్ట్





**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 14**

ఒడిశా రాష్ట్రం నుంచి బెంగుళూరుకు భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను విజయనగరం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువ గల 49.147 కిలోల గంజాయి, రూ.650 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం, విజయనగరం 1వ పట్టణ పోలీసులకు మరియు జిల్లా టాస్క్ ఫోర్స్‌కు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఏప్రిల్ 13న రైల్వే స్టేషన్ వెనుక గూడ్స్ షెడ్ రోడ్డులో పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి బ్యాగులను తనిఖీ చేయగా 40 ప్యాకెట్లలో గంజాయి బయటపడింది. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం, విజయనగరం 1వ పట్టణ పోలీసులకు మరియు జిల్లా టాస్క్ ఫోర్స్‌కు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఏప్రిల్ 13న రైల్వే స్టేషన్ వెనుక గూడ్స్ షెడ్ రోడ్డులో పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి బ్యాగులను తనిఖీ చేయగా 40 ప్యాకెట్లలో గంజాయి బయటపడింది. అరెస్టు చేసిన నిందితులను కర్ణాటక రాష్ట్రానికి చెందిన వరుణ్ కుమార్ మణి (23), నిషా బైరపురా హరీష్ (19), ప్రదీప్ సురేష్ (22), అభిలాష్ రవిరావు (21)గా గుర్తించారు. వీరిలో వరుణ్ కుమార్ మణి, నిషా ఇటీవల వివాహం చేసుకున్నట్లు తెలిసింది. జీవనోపాధి కోసం డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో కర్ణాటకకు చెందిన మౌలా భాయ్ అనే వ్యక్తి సూచనలతో ఈ నేరానికి పాల్పడ్డారని విచారణలో వెల్లడైంది. నిందితులు ఒడిశాలోని రాయఘడకు వెళ్లి నీలూ భాయ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, బెంగుళూరుకు తరలించే క్రమంలో విజయనగరంలో పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో చురుకుగా పనిచేసిన 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే. చౌదరి, ప్రొబేషనరీ ఎస్ఐ జి. కమల భార్గవ్ తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## ఘనంగా 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు



**వంగాయ గూడెం:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ :14:**

స్థానిక వంగాయగూడెం 18 వ డివిజన్ అంబేద్కర్ సర్కిల్ వద్ద 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి భారీ గజమాల వేసి నివాళులు అర్పించి, వైద్య శిబిరాలను ప్రారంభించి, పలువురికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ వాడ వాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు దళిత సోదరులు, నాయకులు మధ్య ఘనంగా నిర్వహించారని, అంబేద్కర్ యొక్క రాజ్యాంగ విలువలు అనేకమైనవి ప్రజల్లోకి వెళుతున్నాయి కాబట్టి ఈ ఏడాది కూడా ఒక వేడుకలాగా జరుగుతున్నాయని, రాజ్యాంగంలో మనకు కల్పించిన హక్కులు ఏమిటనేది ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, వాక్ స్వాతంత్ర్యం...ప్రశ్నించడం అనేది మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, గత ప్రభుత్వంలో అంబేద్కర్ విద్యా విధానాన్ని రద్దు చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అంబేద్కర్ పేరు పెట్టాలని నిర్ణయించామని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క దళిత సోదరులు తెలుసుకోవాలని, రాజ్యాంగ విలువలను తూట్లు పొడిచే అణచివేత ధోరణి.. ఏ పార్టీ చేసిన సహించేది లేదని తెలియజేస్తున్నామని, ఈ జయంతి వేడుకలు సందర్భంగా ఈ ప్రాంత వాసులు ఇక్కడ ఏర్పాటు చేసినటువంటి రక్తదాన శిబిరాలు మరియు ఉచిత మందులు, సేవా కార్యక్రమాలు ఉపయోగించుకోవాలని అదేవిధంగా ప్రతి గురువారం క్యాంప్ ఆఫీసులో ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందరికి అందుబాటులో ఉంటాయని, అదేవిధంగా అంబేద్కర్ స్ఫూర్తితో సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని, అందరూ సమానత్వంతో జీవించాలని, ఈ ఉచిత మెడికల్ క్యాంపులు ఇక్కడ ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని.. అంబేద్కర్ యొక్క ఆశయాలు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లో యువత అంతా నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ ఇంచార్జ్ గరికిముక్కు వీరాంజనేయులు, గోపాల్, ముఖేష్, రాజశేఖర్, మెండా విజయ్, పల్లి విజయ్, రాధమ్మ, వంగాయ గూడెం అంబేద్కర్ యువజన సంఘం పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో అందరం పునరంకితమవుదాం...

ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ది...

బాబాసాహెబ్ అంబేద్కర్ మార్గం సదా స్మరణీయం సదా ఆచరణీయం...

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం,అట్టడుగు వర్గాలకు సమానత్వం సాధించడం కోసం, స్వేచ్ఛ, సమానత్వాలను అందించే విధంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సదా ఆచరణీయం, సదా మనకు మార్గదర్శకం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం వాడపాలెం పెదపేట,కొత్తపేట రెడ్డీపవారిపేట, కొత్తపేట బస్టాండ్ సెంటర్, కమ్మిరెడ్డిపాలెం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, కొత్తపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు,ముత్యాల బాబ్జి,కంఠంశెట్టి శ్రీనివాస్, కె వి సత్యనారాయణ రెడ్డి,గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప విద్యావేత్త, తత్వవేత్త, రాజనీతి కోవిదులు, మన దేశానికి గొప్ప రాజ్యాంగం అందించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వారికి ఘనమైన నివాళులు అర్పించుకొనే అదృష్టం తనకు కలగడం గొప్ప అదృష్టంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ భారతదేశానికి తన కలం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి దిశా,దశ నిర్దేశం చేసే రాజ్యాంగాన్ని,చెక్కుచెదరనటువంటి రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు. భారతదేశ రాజ్యాంగానికి ఉన్నటువంటి గొప్పదనం మరే దేశ రాజ్యాంగానికి లేదన్నారు.అస్పృశ్యతకు గురైనా వెరవకుండా గొప్ప విద్యావంతుడిగా లండన్ ఎకనామిక్స్ స్కూల్లో చదువుకుని ఆర్థిక శాస్త్రంలో పీహెచ్డీ పట్టా అందుకున్న మహోన్నత శక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. సమానత్వం ఉండాలి, సమ సమాజం కావాలి, అందరూ స్వేచ్ఛగా, సౌభ్రాతృత్వంతో బ్రతకాలనే లక్ష్యంతో ఆయన రాజ్యాంగాన్ని అందించారన్నారు. నేడు అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందంటే ఆయన ఇచ్చిన రాజ్యాంగం వల్లే అని ప్రశంసించారు. అందరికీ సమానంగా ఓటు హక్కుని ఇచ్చి ప్రభుత్వాలు సరిగ్గా పనిచేయకపోయినా, ఐదు సంవత్సరాలకు ఒకసారి వారిని గద్దె దించేలా, మరొకరిని ఎన్నుకునేలా ప్రజల చేతుల్లోనే అధికారం పెట్టారని, అదే ప్రజాస్వామ్యమని, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలలో భారతదేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగంగా గణతికెక్కిందని ప్రశంసించారు. ఆయన అందించిన బోధించు సమీకరించు, పోరాడు,నిత్య ఆచరణీయమన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అంబేద్కర్ ఆశయ సాధనలోనే ముందుకు వెళుతుందన్నారు. తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు 1990లో నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా ఉన్న సందర్భంలో వీపీసింగ్ ప్రధానిగా ఉన్న సందర్భంలో బాబాసాహెబ్ అంబేద్కర్ కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేసి భారత ప్రభుత్వం భారతరత్న అందించేలా చేసిన వ్యక్తి ఎన్టీ రామారావు అని గుర్తు చేశారు.పార్లమెంటులో మహానుభావుడు బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఈ రెండు గౌరవాలు ఎన్టీ రామారావు నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా ఉన్నప్పుడే జరిగాయని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ సదా బడుగు, బలహీన వర్గాలు, దళితుల పక్షాన నిలిచి ఉంటుందని ఆయా సందర్భాలను ఉదహరించారు. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో భాగస్వామ్యాన్ని కల్పించిన అంశాలను ప్రస్తావించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో అందరం పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. అనంతరం రావులపాలెం క్యాంపు కార్యాలయం నుంచి కోనసీమ ఆర్చ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ పటానికి మరియు ఇందిరా కాలనీ గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## అంబేద్కర్ ఆశయాలు ఆచరణలో పెట్టాలి

పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి. గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పలు గ్రామాలలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ తన విద్యాభ్యాస సమయంలో ఎన్నో అవమానాలు, వివక్షలను ఎదుర్కొని కష్టపడి చదివి, మన దేశానికి రాజ్యాంగాన్ని రచించారు. అంబేద్కర్ ని కేవలం ఆయన జన్మదినం లేదా వర్ధంతి రోజుల్లో మాత్రమే గుర్తు చేసుకోవడం కాదు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలి. అంబేద్కర్ జీవితంలో ప్రధానమైన సందేశం విద్య. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేయాలి. అలా చేసినప్పుడే అంబేద్కర్ ఆశయాలను మనం నిజంగా గౌరవించినట్టవుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేటి భారతదేశం ఆర్థిక అసమానతలను అధిగమిస్తూ, స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. యువతకు నా సందేశం ఏమిటంటే- ప్రతి ఒక్కరూ చదువుకుని, తమ జ్ఞానంతో తమ గ్రామం, మండలం, రాష్ట్రం, దేశానికి సేవ చేయాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంబేద్కర్ యువజన సంఘాల ప్రతినిధులు, అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి

## -జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమానత్వమే పునాదిగా ఒక వర్గానికో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదని ఆయన ప్రపంచ స్థాయి మేధావిగా కుల వివక్షత నిర్మూలన, స్త్రీ సాధికారత, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి అనన్య సామాన్యమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్ట రేట్ నందు భారత రాజ్యాం గ నిర్మాత భారతరత్న డాక్ట ర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్ కాంస్య విగ్రహా నికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అంబేద్కర్ అందించిన రాజ్యాం గం వల్లే నేడు మనమందరం సమాన హక్కులతో జీవిస్తున్నామన్నారు. సమాజం లో మానవ హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్నంతా అంకి తం చేసిన అంబేద్కర్ ఆదర్శాలను గుర్తుచేసుకుని నేటి యువతకు ఆయన రచనలు, సామాజిక సంస్కరణల పట్ల అవగా హన పెంపొందించి సామా జిక న్యాయం, సమానత్వ విలువల దిశగా ప్రేరణ పొందాలన్నారు . ఎస్సీ ఎస్టీలలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాల పిల్లల విద్యా సాధన, అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సామాజిక -ఆర్థిక సంరక్షణ కార్యక్రమాలు సమర్థంగా, పారదర్శకంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛ న్లు, విద్యా సంక్షేమ పథకాలు, స్వచ్ఛంద సంస్థల కార్యక్ర మాలు కూడా అంబేద్కర్ సామా జిక న్యాయ ఆదర్శాలకు సమన్వ యంగా ఉండాలన్నారు. కోనసీమ జిల్లా అంబేద్కర్ ఆదర్శాల ఆధారం గా సమాజ నిర్మా ణం దిశగా ముందుకు సాగాలన్నారు. ఆర్డీవో జి మమ్మీ మాట్లాడుతూ సమాజం లో మానవ హక్కులు, సమాన త్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్నంతా అంకితం చేశారన్నారు.ఆయన ఆశయాలను మన నిత్య జీవితంలో ఆచరిస్తూ, నవ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ సమర యోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు అంబేద్కర్ అస్పృశ్యతకు వ్యతిరేకం గా, సామాజిక సమానత్వానికి, హక్కుల రక్షణకు పోరాడి, భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు .వారి ఆదర్శాలు మనల్ని సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వైపు ముందుకు నడిపిస్తాయ న్నారు.కోనసీమ జిల్లాలోని అందరూ అంబేద్కర్ వారి ఆలోచనలను అను సరించి, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాల్లో ముఖ్యంగా మహి ళలు, దళితులు, వెనుకబాటు వర్గాల ప్రగతికి కృషి చేయా లన్నారు. ఆయన రూపొం దించిన భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు కల్పిస్తూ ప్రజా స్వామ్యానికి బలమైన పునాది వేసిందన్నారు. అణగారిన వర్గాల అభ్యు న్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమై నవన్నారు.ప్రస్తుత తరానికి ఆయన చూపిన మార్గం ఎంతో ప్రేరణాత్మకమని. విద్య ద్వారానే వ్యక్తి, సమాజ అభివృద్ధి సాధ్యమని ఆయన ప్రగాఢంగా నమ్మారని అందు వల్ల యువత ఆయన ఆలో చనలు, విలువలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల న్నారు. జంగా బాబురావు ప్రసంగిస్తూ సమానత్వం, సామర స్యం తో కూడిన సమాజ నిర్మా ణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అంటరానితనంతో కులవివక్షకు గురై కూడా ఉన్నత విద్య ను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శ ప్రాయులు అన్నారు. ప్రపం చంలో బల మైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలుస్తోందశీటే దానికి కారణం ఆయన మనకు ఇచ్చిన రాజ్యాంగమేనన్నారు. రత్న కుమార్ ప్రసంగిస్తూ సమాన అవకాశా లు, హక్కులు అందించి, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారన్నారు. ఇసుకపట్ల రఘు బాబు ప్రసంగిస్తూ అంబేద్కర్ ఆశయసాధనే మన లక్ష్యం కావాలనీ ప్రజాస్వామ్యాన్ని గౌరవి స్తూ, బాధ్యత కలిగిన పౌరుడిగా ఉండడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్ర మంలో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని ఈ జ్యోతిలక్ష్మి దేవి ఏవో కే కాశీ విశ్వేశ్వర రావు డి రత్నకుమార్ వికాస జిల్లా మేనేజర్ జి రమేష్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## భారత జాతి ముద్దుబిడ్డ అంబేద్కర్

### మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు





**మార్కాపురం , సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

ప్రపంచంలో భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను అత్యుత్తమంగా తీర్చిదిద్దుటలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తన శక్తి యుక్తులన్నింటినీ ధారపోసి భారత జాతికి ఎనలేని సేవలు అందించారని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు అన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక కోర్టు సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమానికి ఆయన రాజ్యాంగ రచనకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు బూర్జువా,పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సామాన్యుల హక్కుల కోసం కృషి చేశారని గుర్తు చేశారు.సామాన్యుల కోసం ఆయన తపించడం వెనుక అన్ని వర్గాల శ్రేయస్సును ఆయన దృష్టిలో ఉంచుకున్నారనే వాస్తవాన్ని నేటి తరం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు కొండేపి వైఎస్ఆర్సిపి ఇన్చార్జి డాక్టర్ షంషీర్ అలీబేగ్, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచం తెచ్చిన మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

### విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన దార్ల..రత్న కుమార్

**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

ప్రపంచం మెచ్చిన మహా నేత,నవ భారత రాజ్యాంగ నిర్మాత,ప్రపంచ జ్ఞాని,న్యాయ కోవిదుడు,దేశ దిక్సూచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు దార్ల రత్న కుమార్ తెలిపారు.మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక కోర్టు సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం నిర్వహించి ఘనమైన నివాళులర్పించారు..ఈ నేపథ్యంలో దార్ల రత్నకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని తెలిపారు..భారత రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులను ప్రసాదించి వారి అభివృద్ధికి తోడ్పడిన మహనీయుడని కొనియాడారు..సమాజంలో ఉన్న అంటరానితనం వివక్షతను రూపుమాపడానికి ఆజన్మాంతం పోరాడిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలిపారు..ప్రతి ఒక్కరూ చదువుకొని సమాజ అభ్యుదయానికి పాటుపడాలని కోరారు..ఈ కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్,సామాజికవేత్త బత్తుల నరసింహారావు, లింగాల శ్రీను,జక్కల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొమరోలు లో నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఈనెల 15వ తేదీన నియోజకవర్గంలోని ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం.

### గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి.

**కొమరోలు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

కొమరోలు లోని ఇస్లాంపేట తో పాటు పలు వీదులకు నీరు సరఫరా సక్రమంగా జరిగేందుకు తగు చర్యలు తీసుకుంటామని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొమరోలు వచ్చిన సందర్భంగా పలువురు మహిళలు తమ వీధులకు నీరు సక్రమంగా రావడం లేదని, ఎమ్మెల్యే అశోక రెడ్డికి వివరించారు. ఇస్లాంపేటలోని పలు వీధిలోకి నీరు సరఫరా చేసే విద్యుత్ మోటారు, గోపానిపల్లెకు నీరు సరఫరా చేసే విద్యుత్ మోటారు మరమ్మతులకు గురికావడంతో గత నాలుగు ఐదు రోజులుగా కొమరోలు ఇస్లాంపేటలోని పలు వీధులకు, గోపానిపల్లి గ్రామానికి నీరు సరఫరా నిలిచిపోయిందని, అంతేకాక కొమరోలు పట్టణంలో దాదాపు 16 విద్యుత్ మోటార్లు ఉండగా, గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పేర్ గా ఒక్క విద్యుత్ మోటారు కూడా లేకపోవడంతో మరమ్మతులు గురైన మోటర్ ను రిపేరు చేయించి తిరిగి ఏర్పాటు చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీనితో ప్రజలు నీటి ఎద్దడికి గురవుతున్నారని పెన్ పవర్ ప్రతినిధి శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందిస్తూ, ఈనెల 15వ తేదీన గిద్దలూరులో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించనున్నట్లుగా చెప్పారు. ఆ సందర్భంగా గ్రామాలలో తలెత్తిన నీటి ఎద్దడి సమస్యతో పాటు అన్ని గ్రామాలకు సక్రమంగా నీరు సరఫరా చేసేందుకు అవసరమైన సూచనలు సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నట్లుగా చెప్పారు. కొమరోలు పట్టణంలో ఎన్ని విద్యుత్ మోటార్లు ఉన్నాయి? ఎన్ని మోటార్లు స్పేర్ గా ఉన్నాయి? ఇంకా ఎన్ని అవసరం అవుతాయి అనే విషయాలను ఎంపీడీవోతో కూలంకషంగా చర్చించి నీటి ఎద్దడి సమస్య శాశ్వత పరిష్కారం కల్పిస్తామని ఆయన తెలిపారు. అందువల్ల మండలంలోని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, అన్ని గ్రామాలకు సక్రమంగా నీరు సరఫరా చేసేందుకు తగు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వివరించారు. కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాల వీధిలో



పైపుల ద్వారా మురికి నీరు వస్తున్నదని, ఆ వీధికి చెందిన మహిళలు ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించి ఎంపీడీవోని పిలిపించి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీకు అందుబాటులో తమ సోదరులు ముత్తుముల సంజీవరెడ్డి ఉన్నారని సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి వివరించి, సమస్యల పరిష్కారానికి సంజీవరెడ్డికి సహకరించాలని ,ఆ మేరకు తాను కూడా సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మహిళలకు హామీ ఇచ్చారు. ఆ కార్యక్రమంలో కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ , ఎడమకలు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు బిజ్జాల తిరుమలరెడ్డి, షేక్ హసీనా, గజ్జలకొండ నారాయణ, మాజీ కోఆప్షన్ నెంబర్ షేక్ నబి, బాదినేని పల్లె తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి, తదితర తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

### జనసేన సీనియర్ నాయకుడు దేగల సతీష్



**కాకినాడ జిల్లా, రూరల్, సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 14**

అంబేద్కర్ జయంతి కార్యక్రమం లో బాగంగా ఆర్యవటం , గొల్లపాలెం ఊడా వారిపేట లో జరిగిన కార్యక్రమాలలో దేగల సతీష్,గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ లు పాల్గొని పూలమాలలతో ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ నేటి తరానికి పూజ్యుడని, ఈ రోజు న మనందరం అనుభవిస్తున్న ఈ సామాజిక స్వేచ్ఛా హక్కులు, ఆ రోజు న ఆయన రాజ్యాంగంలో పొందుపరచడం వల్లనే నని, ఈ రోజున మనందరం స్వేచ్ఛాయుతంగా పరిపాలింపబడుతున్నామని కొనియాడారు ఎస్సై మోహన్ కుమార్ మాట్లాడుతూ యువత అంబేద్కర్ ఆశయాలను పాటిస్తూ చెడు మార్గాలను వీడి సేవా భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవటం చందల దుర్గాప్రసాద్,నాని, శివ, రాము, శ్రీరామ్, రమణ ఊడా వారిపేటలో మాజీ సర్పంచ్ లు పోతురాజు ప్రసన్న మౌనిక, బాబూరావు ఎస్సై మోహన్ కుమార్, అడ్వకేట్ రెడ్డి అన్నవరం, ఊడా అజయ్ . రవ్వ శ్రీను,డాక్టర్ శ్రీను గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మర్రిపూడిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు





**పొదిలి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

మర్రిపూడి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం నాడు మర్రిపూడి మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టి కృషి చేయాలని కోరారు. అలాగే భారతదేశానికి అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ బర్త్ డే కేక్ ను కట్ చేసి, అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తరాలు మారిన చెరగని సంతకం బాబా సాహెబ్ అంబేద్కర్

### టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు



**యర్రగొండపాలెం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

పేదల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం స్వేచ్ఛ, సమానత్వం, అందడంకోసం రెండు సంవత్సరాల, పదకొండు నెలల పద్దెనిమిది రోజులపాటు కష్టించి భారత రాజ్యాంగం రచించాడని, తరాలు మారిన చెరగని సంతకం బాబా సాహెబ్ అంబేద్కర్ అని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.అంబేద్కర్ 135 వ జయంతి సందర్బంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెఏసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి వేడుకలలో పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని కుల వివక్షను తొలగించడానికి అంబేద్కర్ మహాశయుడు ఆయన జీవితాన్నే అంకితం చేసాడని, ఆయన ఆశయసాధనకు అందరు కృషి చేయాలన్నారు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నేత్రుత్వంలోని కూటమి ప్రభుత్వం అంబేద్కర్ ఆశయ సాధన కోసం, అంబేద్కర్ స్పూర్తితో పరిపాలన సాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలొ జెఏసి నాయకులు సింగా ప్రసాద్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, నాయకులు చేకూరి సుబ్బారావు, మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, మంత్రునాయక్, కె, సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీ వివేక డిగ్రీ విద్యార్థి ప్రతిభ

**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 14**

తమిళనాడులోని తాజంబూర్‌లో ఈనెల 12న జరిగిన జాతీయ స్థాయి 20-20 క్రికెట్ టోర్నమెంట్‌లో కందుకూరుకు చెందిన బి.ఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల శ్రీ వివేక డిగ్రీ కళాశాల విద్యార్థి నల్లమల్లి మహేష్ అద్భుత ప్రతిభ కనబరిచారు. సిఎన్ సిఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఏపీ జట్టు, తమిళనాడు జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన మహేష్‌ను సోమవారం కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బి.ఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ మహేష్ ప్రస్తుతం శ్రీ వివేక డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బిసిఏ చదువుతున్నాడని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో కళాశాలకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని కొనియాడారు.తమ విద్యాసంస్థల్లో అకడమిక్ అంశాలతో పాటు ఎన్.సి.సి , క్రీడలకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జి.బాల భాస్కరరావు,బి. నరేంద్ర బాబు,ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, ఇంచార్జి శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అధ్యాపక బృందం పాల్గొని మహేష్‌కు అభినందనలు తెలియజేశారు.



# ఎల్లో డ్రెస్‌లో కృతి శెట్టి.. కిర్రాక్ లుక్ వైరల్!







తెలుగు సినీ ప్రేక్షకులకు 'బేబమ్మ'గా బాగా దగ్గరైన కృతి శెట్టి, తనదైన నటనతోనూ, అందంతోనూ తక్కువ కాలంలోనే గుర్తింపు తెచ్చుకుంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ ఫోటోలను అభిమానులతో పంచుకునే కృతి, ప్రతీసారి తన డ్రెస్సింగ్ స్టైల్‌తో ఆకట్టుకుంటూనే ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

క్లాస్ మాస్ ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకునేలా ఆమె ఈ ఫోటోషూట్‌లో మెరిసింది. ఈ లాంగ్ పసుపు గౌన్ ఆమెకు చాలా స్టైలిష్ లుక్‌ను ఇచ్చింది. స్లీవ్‌లెస్ టాప్‌తో కూడిన ఈ డ్రెస్ డిజైన్ ఆమె గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేసింది. ముఖ్యంగా డ్రెస్‌కు ఉన్న కట్ ఆమె లుక్‌కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఎక్కడా అతిగా అనిపించకుండా, చాలా హుందాగా కనిపిస్తూనే తనలోని గ్లామర్ యాంగిల్‌ను ఈ ఫోటోల ద్వారా హైలెట్ చేసింది. తన హెయిర్ స్టైల్ మినిమమ్ మేకప్‌తో ఆమె సహజ సిద్ధమైన అందాన్ని ప్రదర్శించింది. ఈ ఫోటోలలో కృతి ఇచ్చిన పోజులు చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాయి. కిటికీ పక్కన నిలబడి ఆకాశం వైపు చూస్తున్నట్లుగా ఇచ్చిన స్టిల్స్, ఆమెలోని విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్స్‌ను తెలియజేస్తున్నాయి. చెవికి పెట్టుకున్న చిన్నపాటి జుమ్కీలు తప్ప మరే ఇతర భారీ ఆభరణాలు వాడకుండా తన డ్రెస్‌నే హైలైట్ చేసింది. వైట్ కలర్ హీల్స్ ఆమె మొత్తం కాస్ట్యూమ్‌కు పర్ఫెక్ట్ కాంబినేషన్‌గా నిలిచాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే వేలల్లో లైకులు, కామెంట్లు వచ్చాయి.

ఇక ఉప్పెన సినిమాతో ఆమె అందుకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. తొలి చిత్రంతోనే వంద కోట్ల వసూళ్లను సాధించిన హీరోయిన్‌గా రికార్డు సృష్టించింది. ఆ తర్వాత 'శ్యామ్ సింగరాయ్', 'బంగార్రాజు' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంది. అయితే, గత కొంతకాలంగా ఆమెకు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. అయినప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళ చిత్రాల్లోనూ అవకాశాలు దక్కించుకుంటూ తన పరిధిని విస్తరించుకుంటోంది. నెక్స్ట్ తమిళంలో ఆమె నటించిన ా×ఖ సినిమా రిలీజ్ కానుంది.

ప్రస్తుతం కృతి శెట్టి తన దృష్టిని వైవిధ్యమైన పాత్రలపై పెట్టింది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటోంది. కన్నడలో కూడా కొన్ని క్రేజీ ప్రాజెక్టులలో ఆమె భాగమైనట్లు సమాచారం. ఒక హీరోయిన్‌గా నిలదొక్కుకోవడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్న కృతి, ఒక బలమైన సక్సెస్ కోసం ఎదురుచూస్తోంది. సోషల్ మీడియా ద్వారా తన ఫాలోయింగ్‌ను నిలబెట్టుకుంటూనే, తనలోని సరికొత్త లుక్స్‌ను ఎప్పటికప్పుడు పరిచయం చేస్తోంది.

# ఐపీఎల్ ఆటగాడిపై రెండేళ్ల నిషేధం విధించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

## ఐపీఎల్ కోసం పీఎస్ఎల్‌ను వీడిన బ్లెస్సింగ్ ముజరబానీ

## జింబాబ్వే పేసర్‌పై రెండేళ్ల పాటు పీసీబీ నిషేధం

## పీఎస్ఎల్‌లో ఆడాల్సి ఉండగా కేకేఆర్ జట్టుకు మారిన వైనం

## ఒప్పంద ఉల్లంఘన కారణంగానే ఈ చర్యలన్న పాక్ బోర్డు

## కేకేఆర్ తరఫున ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడిన ముజరబానీ




ఐపీఎల్ కోసం, పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)కు చివరి నిమిషంలో దూరమైన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. పీఎస్ఎల్‌లో రెండేళ్ల పాటు ఆడకుండా అతనిపై నిషేధం విధిస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి, 29 ఏళ్ల ముజరబానీ ఐపీఎల్, పీఎస్ఎల్ వేలంలో అమ్ముడుపోలేదు. అయితే, పీఎస్ఎల్ ఫ్రాంచైజీ ఇస్లామాబాద్ యునైటెడ్ అతడిని రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా తీసుకుంది. కానీ, అదే సమయంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కూడా ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో ముజరబానీ పీఎస్ఎల్ కాకుండా ఐపీఎల్‌లో ఆడేందుకే మొగ్గు చూపాడు. ఈ పరిణామంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టిన పీసీబీ, ముజరబానీపై రెండేళ్ల నిషేధం విధించింది. ఒప్పందాలను ఉల్లంఘించడం, క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. పీఎస్ఎల్ ప్రతిష్ఠను, వృత్తిపరమైన వాతావరణాన్ని కాపాడేందుకే ఈ కఠిన చర్యలు అవసరమని పేర్కొంది. గత ఏడాది కూడా ఇలాగే ప్రవర్తించిన కార్బిన్ బాష్‌పై పీసీబీ ఏడాది పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, ముజరబానీ ఇప్పటికే కేకేఆర్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. ముజరబానీతో పాటు స్పెన్సర్ జాన్సన్, దసున్ షనక కూడా పీఎస్ఎల్ ఒప్పందాలను వదులుకుని ఐపీఎల్‌లో చేరారు. వీరిపై పీసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# ఇలా చేస్తే సంజును త్వరగా ఔట్ చేయొచ్చు..! కేకేఆర్‌కు బ్రహ్మాస్త్రం అందించిన ఇర్ఫాన్ పఠాన్




ఐపీఎల్ 19లో భాగంగా మంగళవారం (ఏప్రిల్ 14) చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తలపడనున్నాయి. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ స్టార్ట్ కానుంది. ఈ మ్యాచ్‌కు ముందు అందరి కళ్లు చెన్నై స్టార్ ప్లేయర్ సంజు శాంసన్?పైనే ఉన్నాయి. ఈ సీజన్‌ను పేలవంగా ఆరంభించిన సంజు ఢిల్లీ క్యాపిటల్స్?పై సెంచరీతో చెలరేగి తన సత్తా ఏంటో మరోసారి చూపించాడు. చెటా? సెంచరీతో ఈ సీజన్‌లో చెన్నై తొలి విజయాన్ని నమోదు చేసింది. సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి వచ్చిన సంజు శాంసన్‌ను కట్టడి చేసేందుకు కేకేఆర్ ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలో సంజును త్వరగా ఎలా ఔట్ చేయొచ్చో కేకేఆర్‌కు సలహా టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్. కేకేఆర్ స్టార్ స్పిన్నర్ సునీల్ నరైన్ బౌలింగ్‌లో ఆడటానికి సంజు ఇబ్బంది పడతాడని.. నరైన్ బౌలింగ్‌లో ఇప్పటికే అతడు మూడు సార్లు ఔట్ అయ్యాడని గుర్తు చేశారు. నరైన్ బౌలింగ్?లో సంజు దాదాపు 80 బంతులు ఎదుర్కొగా స్ట్రైక్ రేట్ కేవలం 80 మాత్రమే ఉందని అతని బలహీనతను బయటపెట్టాడు. నరైన్ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడేందుకు కూడా శాంసన్ ఎక్కువగా రిస్క్ చేయడని పేర్కొన్నారు. ఇవాళ్టి మ్యాచులో కేకేఆర్ నరైన్‌ను ఎంత తొందరగా బౌలింగ్‌కు తీసుకువస్తే శాంసన్‌ను అంత త్వరగా ఔట్ చేయొచ్చని సూచించాడు. అయితే, చెపాక్ పిచ్‌పై బౌన్స్ ఎక్కువగా ఉండటంతో బ్యాటర్లు భారీ స్కోర్లు చేసే అవకాశం ఉందని.. మరీ సంజు ఎలా ఆడతాడో చూడాలన్నారు ఇర్ఫాన్. ఐపీఎల్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ జట్లుగా పేరున్న చెన్నై, కోల్‌కతా ఈ సీజన్‌ను అతి దారుణంగా ఆరంభించాయి. ఇరు జట్లు ఆడిన తొలి మ్యాడు మ్యాచుల్లో ఓటమి పాలయ్యాయి. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని సీఎస్కే నాలుగో మ్యాచ్‌లో ఎట్టకేలకు డీసీపై విజయం సాధించాయి టోర్నీలో బోణీ కొట్టింది. ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు ఓడిపోగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అవడంతో ఈ టోర్నీలో కేకేఆర్ ఇంకా విజయాల ఖాతా తెరవలేదు. దీంతో చెన్నైపై గెలిచైనా బోణీ కొట్టాలని కేకేఆర్ భావిస్తోంది.

# ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్.. SRHలోకి ఎలా వచ్చారో తెలుసా..? అంతా వరుణ్ ఆరోన్ పుణ్యమే..!



ఈ IPL సీజన్‌లోనే ఓటమి ఎరుగని జట్టుగా పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉన్న RR జట్టుకు SRH టీం ఓటమి రుచి చూపించింది. రాజస్తాన్ రాయల్స్ ఓడిపోయినా పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలోనే కొనసాగుతుండొచ్చు. కానీ.. ఓడిన తీరు మాత్రం రాజస్తాన్ అభిమానులను పీడ కలలా వెంటాడుతుందని చెప్పక తప్పదు. అందుకు.. కారణం.. ఇద్దరు SRH బౌలర్లు. ఆరంభ మ్యాచ్‌తోనే SRH పేసర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ RR బ్యాటర్లకు చుక్కలు చూపించారు. ఐపీఎల్ మ్యాచ్ ఫస్ట్ ఓవర్లోనే మూడు వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా ప్రఫుల్ హింగే రికార్డుకెక్కాడు. మొత్తం నాలుగు వికెట్లు తీసి ఔరా అనిపించాడు. సాకిబ్ హుస్సేన్ కూడా 4 వికెట్లు తీసి శభాష్ అనిపించాడు. ఈ ఇద్దరు బౌలర్లు వజ్రాలే కానీ ఈ వజ్రాలను వెలికితీసి సాన పట్టింది మాత్రం ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్. అసలు.. ఈ ఇద్దరి బౌలర్లను SRH వేలంలో చెరో రూ.30 లక్షలకు కొనడానికి కూడా కారణం ఇతనే. గత డిసెంబర్‌లో జరిగిన వేలంలో తన పట్టుదల వల్లే ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఈ ఇద్దరు బౌలర్లను రూ. 30 లక్షలకు తీసుకోవడానికి అంగీకరించిందని ఆరోన్ కూడా చెప్పారు. అంతేకాదు.. ప్రఫుల్ హింగే జర్నీలో ఆరోన్ కీలక పాత్ర పోషించాడు. విదర్భకు చెందిన 24 ఏళ్ల హింగే.. 10 రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడి, ఐపీఎల్‌లో అరంగేట్రం చేయడానికి ముందు కేవలం ఒకే ఒక టీ20 మ్యాచ్ ఆడాడు. ఆ సమయంలోనే ప్రఫుల్ హింగే కెరీర్ కోలుకోలేని మలుపు తిరిగింది. హింగే బౌలింగ్ కెరీర్‌కే ముప్పు తెచ్చే గాయం అయింది. అతని క్రికెట్ కెరీర్ ముగిసిపోయిందని కుటుంబం కూడా ఫిక్స్ అయిపోయింది. ఆ సమయంలోనే ప్రఫుల్ హింగేకు వరుణ్ ఆరోన్ అండగా నిలిచాడు. గాయం నుంచి కోలుకునే దిశగా హింగేలో ఆత్మ స్థైర్యాన్ని నింపాడు. అసలైన కెరీర్ ఇప్పటి నుంచే మొదలైందని.. ప్రఫుల్‌కు గురువులా మారి బౌలింగ్‌లో అన్ని రకాల టెక్నిక్స్ నేర్పించాడు. ఫలితమే SRH మ్యాచ్‌లో ప్రఫుల్ హింగే అద్భుత ప్రదర్శన. సాకిబ్ హుస్సేన్ బౌలింగ్ కెరీర్ కూడా వరుణ్ ఆరోన్ వల్లే అనుకోని మలుపు తిరిగింది. SRH టీంలోకి ఫాస్ట్ బౌలర్ల కోసం వరుణ్ ఆరోన్ అన్వేషిస్తున్న క్రమంలో.. MRF అకాడమీలో సాకిబ్‌ను గుర్తించి.. అతని బౌలింగ్ ను వరుణ్ ఆరోన్ గమనించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఉత్తర ప్రదేశ్‌పై వేసిన పదునైన స్పెల్‌తో షకీబ్ మళ్ళీ ఆరోన్ కంట్లో పడ్డాడు. సాకిబ్‌ను SRH జట్టులోకి తీసుకోవాలని మేనేజ్‌మెంట్ దగ్గర మొండిగా పట్టుబట్టి మరీ సాకిబ్ ను బేస్ ప్రైస్ 30 లక్షలకు ా=ఎ జట్టులోకి తీసుకునేలా చేశాడు. సాకిబ్‌పై వరుణ్ ఆరోన్ పెట్టుకున్న నమ్మకం వృధాగా పోలేదు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 4 వికెట్లు తీసి సాకిబ్ హుస్సేన్ దుమ్ములేపాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776